# సామ్రాజ్యవాద దేశాల మధ్య వైరుధ్యాలను పెంచుతోన్న వాణిజ్య యుద్ధం

**'రక్షణాత్మకవాదాన్ని** ప్రతిఘటించడాన్ని" అమెరికా నిరాకరించటంపట్ల పాశ్చాత్య సామ్రాజ్య వాద దేశాల నడుమ ఒక సంవత్సరకాలం క్రితం వివాదం నెలకొన్నది. అంతర్జాతీయ ద్రవ్య సంస్థలు ఈ పదబంధాన్ని నిరంతరంగా ఉపయోగిస్తూ రాగా, దీనికి కట్టుబడి వుంటామని పశ్చిమ దేశాల నాయకులు ప్రకటించారు.

ఒక ఏడాది తర్వాత, 2018 జూన్‌లో యూరోపియన్ యూనియన్, కెనడా, జపాన్‌ల నుండి దిగుమతి చేసుకునే స్టీలు మరియు అల్యూమినియంలపై 25 శాతం వరకూ అమెరికా సామ్రాజ్యవాదం సుంకాలు విధించింది.

జులై 6న, చైనా నుండి దిగుమతి అయిన 34 వందలకోట్ల డాలర్ల విలువైన యంత్ర సామాగ్రి, ఎలక్ట్రానిక్, ఇతర వస్తువులను లక్ష్యం చేసుకొని అమెరికా 25 శాతం సుంకాలు విధించింది. చైనా దీనిని తిప్పికొట్టేట్లయితే, 20 వేల కోట్ల డాలర్ల చైనా ఎగుమతులకు కూడా ఈ సుంకాల విధింపును విస్తరిస్తామని ట్రంప్ హెచ్చరించాడు. అమెరికా యొక్క మేధోసంపత్తి హక్కులను(ఐపిఆర్) గుర్తించని చైనాను అమెరికా లక్ష్యంగా చేసుకుంది. అయితే చైనా దీన్ని తిప్పికొడుతూ ఆటోమొబైల్ పరికరాలు, వ్యవసాయ సరుకులతో సహా అమెరికా నుండి తమ దేశంలోకి దిగుమతి అయిన 3,400 కోట్ల డాలర్ల విలువైన వానిపై 25శాతం పన్నులు విధించింది.

అమెరికా, చైనాలమధ్య వాణిజ్య యుద్ధాన్ని మరింత ముందుకు సాగిస్తూ ట్రంప్ ప్రభుత్వం వివిధ వినియోగ వస్తువుతో సహా 20,000 కోట్ల డాలర్ల విలువైన చైనా ఎగుమతులపై 10 శాతం పన్నుల విధింపు ప్రకటన చేసేందుకు తయారవు తోంది. పన్నులు విధించే వస్తువుల పూర్తిజాబితా తరువాత విడుదల చేస్తారు.

ఈ నెలలో జరిగే ఓ బహిరంగ విచారణ తర్వాత మరో 1600 కోట్ల డాలర్ల విలువైన చైనా వస్తువులపై కూడా పన్నులను విధించవచ్చు. అమెరికా ప్రతిపాదించిన మేధోసంపత్తి హక్కులను చైనా నిరాకరించి, డాలర్ మారకాన్ని తిప్పికొడ్తామని వాగ్దానం చేసి, బొగ్గు, చమురులను లక్ష్యంగా చేసుకొని తమ దేశానికి వచ్చే 1600 కోట్ల డాలర్ల విలువైన అమెరికా ఎగుమతులపై పన్నులు విధించింది.

ట్రంప్ ప్రభుత్వంయొక్క నిర్హేతుక ప్రవర్తనగా ఈ పరిణామాలను కొందరు పరిగణిస్తున్నారు. ట్రంప్‌యొక్క పిచ్చి తరహా ప్రదర్శనగా దీనిని భావించరాదు. అమెరికా సామ్రాజ్యవాద ప్రయోజనాలే ఇలాంటి చర్యలను నిర్దేశిస్తున్నాయి. ఈలాంటి చర్యలు పూర్తిస్థాయి వాణిజ్యయుద్ధం రూపంగా కూడా విరుచుకుపడొచ్చు.

తమ మిత్రకూటమికి చెందిన యూరోపియన్ యూనియన్, జపాన్, కెనడా తదితర దేశాల దిగుమతులపై పన్ను విధింపును డెమోక్రటిక్ పార్టీ నాయకులు విమర్శిస్తూనే, చైనాకు వ్యతిరేకంగా అమెరికా అధ్యక్షుడు సాగిస్తున్న వాణిజ్యయుద్ధ చర్యలను బాహాటంగానే సమర్థిస్తూ, వాటిని వీలైతే మరింత విస్తృతపరచాలని కూడా డిమాండ్ చేస్తున్నారు. కనుక, వాణిజ్య యుద్ధం కేవలం ట్రంప్ తీసుకున్న చర్య మాత్రమే కాదని, అమెరికా సామ్రాజ్యవాద ద్రవ్య గుత్తపెట్టుబడిదారీ పాలకవర్గం యొక్క చర్యగా సుస్పష్టమౌతోంది. "ఎదుగుతోన్న సాంకేతిక పరిశ్రమలపై పైచేయి సాధించాలన్న చైనాయొక్క నిర్లక్ష్యపూరిత పథకం" గురించి ట్రంప్ ఆర్థిక సలహాదారు పీటర్, జూన్ 3వ వారంలో వాల్‌స్ట్రీట్ జర్నల్‌లో స్పష్టంచేశాడు. "దీనిని సహించరాదని, "వ్యూహాత్మక సాంకేతికరంగం"లో చైనా పెట్టుబడులు అమెరికా తయారీ రంగానికి, రక్షణ పరిశ్రమల రంగానికి పెనుముప్పుగా సవాల్‌గా పరిణమించగలద"ని ఆయన పేర్కొంటూ "ఆర్థిక భద్రతే జాతీయ భద్రత"గా వక్కాణించారు.

ప్రపంచంలో సైనిక బడ్జెట్‌పై అత్యధిక వ్యయం చేస్తున్న దేశాలలో చైనా రెండవ దేశమని, అతిపెద్ద సైన్యాన్ని కలిగివుందని, మూడవ అతిపెద్ద వైమానిక బలగాన్ని, 300 యుద్ధనౌకలు, 60 జలాంతర్గాము లతో పెద్ద నావికా బలగాన్ని కలిగివుందని అమెరికా నేషనల్ ఇంటలిజెన్స్ ఏజన్సీ డైరెక్టర్ డాన్ కోట్స్ పేర్కొన్నాడు. ఇదంతా ఆధునీకరణ, ఉన్నతీకరణ క్రమమనీ, దీన్ని అమెరికా భద్రతకు హెచ్చరికగా భావించాలని పేర్కొన్నాడు.

కనుక, ఇప్పుడు నడుస్తున్నది కేవలం అమెరికా-చైనాల ద్వైపాక్షిక వాణిజ్యంలో తలెత్తిన విభేదం మాత్రమే కాదని, చైనాపై వాణిజ్యయుద్ధం సాగించటానికి అది ప్రధాన కారణం కాదని స్పష్ట మౌతోంది. అమెరికా నుండి చైనా మరిన్ని వస్తువులను దిగుమతి చేసుకోవటంద్వారా వాణిజ్య లోటును తగ్గించుకోవచ్చునన్న చైనా విజ్ఞప్తిని అమెరికా పాలకులు తిరస్కరించారు.

'మేడ్ ఇన్ చైనా-2025' పథకాన్ని చైనా రూపొందించి, తదనుగుణంగా తన పారిశ్రామిక, సాంకేతిక సామర్థ్యాలను అనేక రెట్లు పెంచు కుంటోంది. చైనా ఒక ఆర్థికశక్తిగా ఎదగకుండా దానిని అణచిపెట్టి, అర్ధవలస స్థితికి తిరిగి నెట్టేయాలని అమెరికా సామ్రాజ్యవాదం భావిస్తోంది.

1930ల ఆర్థికమాంద్యం తర్వాత ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థ ఎదుర్కొన్న అతిపెద్ద ఆర్థిక సంక్షోభం, 2008 సం॥నాటి ఆర్థిక సంక్షోభమే. ఈ సంక్షోభం సామ్రాజ్యవాదశక్తుల నడుమ వాణిజ్య యుద్ధాలను ప్రేరేపించింది. సామ్రాజ్యవాద దేశాల నడుమ లోతైన, పరిష్కరింపజాలని వైరుధ్యాలే, అమెరికా సామ్రాజ్యవాదం నేడు ప్రారంభించిన వాణిజ్య యుద్ధానికి కారణం. సామ్రాజ్యవాద దేశాలు తమ మార్కెట్లను రక్షించుకుంటూ, విస్తరించు కునేందుకు లాభాలను పెంపొందించుకునేందుకు పోటీపడుతూనే ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా లోని దేశాలను లోబరుచుకునే విషయంలో కుమ్మక్కు అవుతున్నాయి.

2008 నాటి ఆర్థిక సంక్షోభం నుండి గత దశాబ్ద కాలంగా, సామ్రాజ్యవాద దేశాల గుత్తపెట్టుబడిదారీ పాలకవర్గాలు తమ సూపర్ లాభార్జనలకోసం అత్యంత కఠినమైన పొదుపు చర్యలను కార్మిక ప్రజానీకంపై విధించాయి; దారుణమైన నిర్బంధం, అణచివేతను వారిపై ప్రయోగించాయి. ఇది సామాజిక అసమానతలను తీవ్రంచేస్తోంది. పిడికెడు మందిగా వున్న ధనికులు అత్యధిక సంపన్నులుగా మారుతుండగా, కోట్లాది మంది శ్రామిక ప్రజానీకం నిరుద్యోగం, దారిద్ర్యం, దుర్భర స్థితిలోకి నెట్టివేయబడుతున్నారు. వారంతా అసంతృప్తి, ఆగ్రహంతో రగిలిపోతున్నారు. ప్రజానీకపు ఈ ఆగ్రహాన్ని పశ్చిమదేశాల సామ్రాజ్య వాదులు 'అమెరికాదే మొదటిస్థానం' వంటి నినాదాలతో జాతీయోన్మాదం రేపుతూ ప్రక్కదోవ పట్టిస్తున్నారు. అలాగే వలసదారుల వ్యతిరేక ప్రచారాన్ని సాగిస్తూ, వలసవచ్చిన వారే ఆయా దేశాల్లో ఉద్యోగాల కొరతకు కారణమని ప్రబోధిస్తున్నారు. నయా నాజీలు, జాతీయోన్మాద శక్తులు ప్రాచుర్యం పొంది యూరప్‌లోని కొన్ని దేశాల్లో అధికారంలోకి కూడా వస్తున్నాయి.

సంక్షోభం పెరిగేకొలదీ సుంకాలు, ప్రతి సుంకాల విధింపుతో వాణిజ్యయుద్ధాలు తప్పని సరిగా తీవ్రమౌతాయి. ఇవి ప్రపంచ శ్రామిక ప్రజానీకంపై మరిన్ని పొదుపు చర్యలకు, అణచివేత చర్యలకు కారణమౌతాయి.

00000